సాక్షి తిరుపతి

గురువారం । 17 । ఆగస్టు । 2023



ఘనంగా ఏడుగంగల జాతర

నారాయణవనంలో బుధవారం ఏడు గంగమ్మల జాతర నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. - 8లో



వినూత్నం.. నవరత్న సమాచారం

గాజులమండ్యం పంచాయతీలో వినూత్నంగా నవరత్న సమాచార బోర్డులు ఏర్పాటు చేశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	27
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	38	29
నగరి	37	27

న్యూస్‌రీల్

శబరిమలైకి మంత్రి పెద్దిరెడ్డి



ఇరుముడితో వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి , ఎమ్మెల్సీ భరత్, పక్కన ఎంపీ రెడ్డెప్ప

తిరుపతి మంగళం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం శబరిమలైకు బయలుదేరారు. మండలం రోజులపాటు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప దీక్ష ధరించిన ఆయన తిరుపతి మారుతీనగర్‌లోని నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి ఇరుముడి ధరించి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్ తదితరులతో కలిసి ఇరుముడి ధరించి స్వామియే శరణం అయ్యప్పా అంటూ రైలులో బయలుదేరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప వీడ్కోలు పలికారు.

వెంకటేశ్వరరాజుకు 'గౌరవ్ సమ్మాన్'



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకటేశ్వరరాజు

గూడూరురూరల్: మండలంలోని విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వరరాజుకు రాష్ట్రీయ గౌరవ సమ్మాన్ అవార్డు లభించింది. విద్య, సాహిత్య, కళారంగాల్లో ఆయన సేవలను ప్రశంసిస్తూ మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన ఏకతా ఫౌండేషన్ సామాజిక సంఘటనా భారత్ సేవా సంస్థ వారు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. ఈ మేరకు బుధవారం ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రం పంపించారు. ఈ మేరకు వెంకటేశ్వరరాజును తోటి ఉపాధ్యాయులు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 78,726 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,436 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.94 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

రేపు వెంకటగిరిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్ : వెంకటగిరి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్యామ్‌మోహన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పాస్,ఫెయిల్ అయిన విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పూర్తిచేసిన వారు మేళాకు హాజరుకావచ్చన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు సర్టిఫికెట్లు , ఆధార్ జెరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9491458910, 9177508279 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు : రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టును బుధవారం చిల్లకూరు గురుకుల పాఠశాలలో ఎంపిక చేశారు. మొత్తం 70మంది క్రీడాకారులు హాజరవగా 16 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి శ్రీరేష్, తెలిపారు. ఎంపికైనవారు 18వ తేదీ ఉదయం 6 గంటలకు మైదానానికి రావాలని సూచించారు. జిల్లా జట్టును గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ అభినందించారు.

శాశ్వత లోక్‌అదాలత్‌కు ఇద్దరు సభ్యుల నియామకం

చిత్తూరు అర్బన్: నగరంలోని శాశ్వత లోక్ అదాలత్‌కు ఇద్దరు సభ్యులను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్, చిరంజీవిరెడ్డి నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, పక్కన మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్, కమిషనర్ హరిత (ఇన్‌సెట్) పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న అభినయ్



తిరుపతి అభివృద్ధికి బృహత్ ప్రణాళిక

"తిరునగరి ఖ్యాతి ఇనుమడించాలి.. ప్రజలకు అత్యున్నతంగా మౌలిక వసతులు కల్పించాలి.. ట్రాఫిక్ ఇక్కట్లు తొలగేలా సువిశాలంగా రహదారులను తీర్చిదిద్దాలి.. రోడ్ల నిర్మాణంలో నగరపాలక సంస్థతో టీటీడీ భాగస్వామ్యం కావాలి.. తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆహ్లాదం పంచేలా తిరుపతిని ప్రగతిపథంలో నడపించాలి" అని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు.

- నగరం దశ దిశ మారేలా మాస్టర్‌ప్లాన్
- టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో పనులు
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు
- టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతి అభివృద్ధే లక్ష్యంగా బృహత్ ప్రణాళిక రూపొందించినట్లు టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తిరుపతి అభివృద్ధిపై ఆయన సమీక్షించారు. టీటీడీ, నగరపాలక సంస్థ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. భూమన మాట్లాడుతూ నిత్యం లక్షలాది మంది యాత్రికులు తిరుపతి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో తిరునగరిని అత్యున్నతంగా తీర్చిదిద్దడం ద్వారా తిరుపతి పరపతి దేశవ్యాప్తంగా ఇనుమడిస్తుందని వెల్లడించారు. నగర అభివృద్ధిలో ఇకపై టీటీడీని పూర్తిస్థాయిలో భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా త్వరలోనే టీటీడీ, నగరపాలక సంస్థ అధికారులు సమష్టిగా ప్రతిపాదనలు సిద్ధం చేయనన్నట్లు వివరించారు. ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టిన 13 రోడ్ల ఆధునికీకరణ, ఫుట్‌పాత్‌లు, డ్రైన్లు, ఇతర మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఇందుకోసం రూ.31కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

పనులు వేగవంతం

నగరంలోని ప్రధాన కూడళ్లలో ఐమాక్స్ లైటింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని టీటీడీ బోర్డు చైర్మన్ భూమన ఆదేశించారు. లీలామహల్ కూడలి నుంచి మంగళం వరకు 150 వాట్స్ లైటింగ్ వ్యవస్థను టీటీడీ ఆధ్వర్యంలో వేగంగా అభివృద్ధి చేయాలని సూచించారు. చెర్లోపల్లి కూడలి–నాయుడుపేట–బెంగళూరు నేషనల్ హైవే మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి భూసేకరణను తుడాకు అప్పగించామని, రోడ్డు నిర్మాణ బాధ్యతను టీటీడీ చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించినట్లు వివరించారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే తమిళనాడు, కర్ణాటక, మదనపల్లె నుంచి వచ్చే వాహనాలు జూపార్క్ రోడ్డు ద్వారా అలిపిరికి చేరుకుంటాయని, తద్వారా నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించవచ్చని తెలిపారు. ఎస్వీయూ–జూపార్క్ రోడ్డును కలుపుతూ నిర్మించే రెండు మాస్టర్ ప్లాన్‌రోడ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తిరుచానూరు, గోవింద రాజస్వామి పుష్కరిణిలకు నిత్యం నీటి సరఫరా చేయడంలో టీటీడీకి మున్సిపల్ కార్పొరేషన్ సహరించాలని సూచించారు. ఇందుకోసం రూ.40 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేశారు. అలాగే టీటీడీ ఆస్పత్రుల నుంచి సీవరేజ్ వాటర్‌ను కార్పొరేషన్ యూడీఎస్ లైన్‌లో కలిపేందుకు ప్రతిపాదనను సిద్ధం చేయాలని కోరారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు సామవాయి–వైఎస్సార్ మార్గ్‌లను కలుపుతూ శ్రీనివాసం సముదాయానికి తూర్పు వైపున కనెక్టివిటీ రోడ్డును అభివృద్ధి చేయాలని చెప్పారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల నుంచి మురుగు నీటి కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. శ్రీనివాస కళ్యాణ మండపాల ఇన్, అవుట్ గేట్లను విస్తరించి వాడుకలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం కమిషనర్ హరిత నగరంలో చేపట్టిన పనులు, అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. సమావేశంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, టీటీడీ సీఈ నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ సీఈ రామచంద్రారెడ్డి, కార్పొరేషన్ ఎస్ఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తుల రుణం తీర్చుకుందాం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యం
- రాష్ట్రంలో డాక్టర్ అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయం
- నా మట్టి–నా దేశం కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

నగరి : తరతరాలుగా పడిన యాతన తీర్చి, బానిస సంకెళ్ల నుంచి విముక్తి ప్రసాదించిన త్యాగమూర్తులను స్మరించుకుందాం.. మన రుణం తీర్చుకుందాం అని మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్ ఆవరణలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన నా మట్టి–నా దేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలిసి మొక్కలు నాటి పతాకావిష్కరణ చేశారు. అందరితో 'ఈ దేశాన్ని గౌరవిస్తాం.. ఈ దేశాన్ని రక్షిస్తాం.. ఈ దేశాన్ని అభివృద్ధి చేయడంలో మేమందరం భాగస్వాములవుతాం.' అని మట్టి చేతులతో ప్రమాణం చేయించారు. అనంతరం మట్టిని కుండల్లో సేకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలం ఉందన్నారు. వారి ప్రాణత్యాగం నేడు మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిందన్నారు. అలాంటి త్యాగమూర్తులను స్మరించుకుని వారి రుణం తీర్చుకోవడంతోపాటు వారి కీర్తిని భావితరాల వారికి తెలియజెప్పాలన్నారు. అందుకే వారికి గుర్తుగా మొక్కలు నాటుతూ శిలాఫలకాలను ప్రారంభించడం జరుగుతోందన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి సేకరించిన మట్టి ఢిల్లీ వరకు చేరుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన మట్టితో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్మారక స్థూపాన్ని కట్టి జాతికి అంకితం చేస్తారని తెలిపారు. అంటే ఆ నిర్మాణంలో దేశప్రజలందరి పాత్ర ఉన్నట్లే అన్నారు. మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకువచ్చారన్నారు. రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేడ్కర్ కోరుకున్న సమ సమాజాన్ని వారి వారసుడిగా నేడు పూర్తిస్థాయిలో నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. దేశభక్తితో అందరూ ముందడుగు వేయాలన్నారు. నా మట్టి–నా దేశం అన్న భావన అందరిలో కలిగితే దేశ ప్రగతికి విఘాతం కలిగించే పనులు ఎవరూ చేయరన్నారు.

త్యాగనిరతిని భావితరాలకు చెప్పేందుకే..

మనకు స్వాతంత్ర్యం తేవడానికి కృషి చేసిన ఎందరో సమరయోధుల త్యాగనిరతితో పాటు స్వాతంత్ర్యం ఎంత విలువైందో భావితరాలకు చెప్పేందుకు నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రస్తుతం ఉన్న అవకాశాలను ఎంత వరకు మనం ఉపయోగించుకోగలం? ఎంతవరకు ముందుకెళ్లగలం? అన్నది ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, మున్సిపల్ డీఈ నరేష్, హౌసింగ్ డీఈ శంకరప్ప, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్ పాల్గొన్నారు.

కవాతులో ఉత్తమ పురస్కారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న 9వ బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరిరూరల్ : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌కు అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో కవాతు ప్రదర్శనకు గాను ఉత్తమ పురస్కారం అందుకుంది. బుధవారం ఈ మేరకు బెటాలియన్ కమాండెంట్ పి.ప్రకాష్ వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అలాగే డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ అతుల్‌సింగ్ చేతులమీదుగా రూ.20 వేలు ప్రోత్సాహక బహుమతి పొందినట్లు వివరించారు.

పకడ్బందీగా క్యాన్సర్ వెబ్ అప్లికేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ఎంట్రో ల్యాబ్స్ వారి క్యాన్సర్ వెబ్ అప్లికేషన్‌ను మరింత పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యసిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇప్పించామన్నారు. స్విమ్స్ , టాటా క్యాన్సర్ ఆస్పత్రుల డాక్టర్లు సూచనల మేరకు పోర్టల్‌లో మరికొన్ని ఆప్షన్లు ఇవ్వాలని కోరారు. ప్రతి సచివాలయ పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీలకు లాగిన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దీనివల్ల సర్వేలో వైద్య సిబ్బంది నమోదు చేసే రోజువారీ వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. బాధితులు, అనుమానితులు, వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన వారిని మూడు కేటగిరీలుగా విభజించాలని సూచించారు. పింక్ బస్సులు ఆయా సచివాలయ పరిధిలోకి వచ్చినప్పుడు ప్రజలకు పరీక్షలు నిర్వహించి పోర్టల్‌లో నమోదు చేసి వివరాలు స్విమ్స్ , టాటా కాన్సర్ ఆస్పత్రులకు వెంటనే చేరేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆ మేరకు నోడల్ అధికారి వెబ్‌సైట్‌లో నమోదైన వారికి అవసరమైన చికిత్సలను తక్షణం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, కాన్సర్ స్పెషల్ ఆఫీసర్ జయచంద్రారెడ్డి, అంకాలజీ డిపార్ట్‌మెంట్ నాగరాజు, గైనకాలజిస్ట్ మాధవి, టాటా ఆస్పత్రి అధికారులు హేమంత్, భారతి, రాస్ అధికారులు నాగరాజు, ప్రాణబందుదాస్, డీపీఎం శ్రీనివాసరావు, ఎస్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ హరినాథ్, డీసీహెచ్ఎస్ మణి, కిరణ్ నాయక్ పాల్గొన్నారు.

పామ్ సాగుకు సాయం

ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తోంది. నగదు ప్రోత్సాహకాలతో తోడ్పాటునందిస్తోంది. వందశాతం సబ్సిడీపై మొక్కలను పంపిణీ చేస్తోంది. డ్రిప్ పరికరాలను సైతం రాయితీపై అందజేస్తోంది. ఈ క్రమంలో రైతాంగం అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. దీంతో జిల్లావ్యాప్తంగా ఆయిల్‌పామ్ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.

- పెరుగుతున్న ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం
- రైతులకు అండగా ప్రభుత్వం
- హెక్టారుకు రూ.29వేల చొప్పున నాలుగేళ్లపాటు ప్రోత్సాహకం
- వందశాతం సబ్సిడీపై మొక్కల పంపిణీ





సాగులో ఉన్న పామాయిల్ పంట

జిల్లా సమాచారం

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం	750 ఎకరాలు
అదనపు సాగు విస్తీర్ణం	సుమారు 500 ఎకరాలు
రైతులు	320 మంది
పామ్ సాగులో ఉన్న మండలాలు	16
కొత్తగా అనుమతులు ఇచ్చినవి	08

తిరుపతి అర్బన్ : జాతీయ నూనె గింజలు, ఆయిల్ పామ్ అభివృద్ధి పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు తోడ్పాటు అందిస్తున్నాయి. దీంతో పామ్ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే 16 మండలాల పరిధిలోని 750 ఎకరాల్లో పంట సాగులో ఉంది. తాజాగా ఆర్‌సీ పురం, బీఎన్ కండ్రిగ, పిచ్చాటూరు, పుత్తూరు, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో సైతం ఆయిల్ పామ్ సాగు చేసుకునేందుకు ఉద్యానశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ క్రమంలో మరో 500 ఎకరాల్లో పామ్ సాగు చేపట్టేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

నాలుగేళ్ల ప్రోత్సాహకాలు

పామ్ ఆయిల్ పెంపకం కోసం ముందుగా వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేస్తోంది. తర్వాత ఏటా హెక్టారుకు రూ.29 వేల చొప్పున నాలుగేళ్లపాటు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ క్రమంలోనే ఎరువుల కోసం ఏడాదికి మరో రూ.5,250, అంతర పంటల సాగుచేసుకునే వారికి అదనంగా రూ.5,250 చొప్పున అందిస్తోంది. పెద్ద తోటల్లో అంతర పంటలు సాగుకు మొదటి ఏడాది రూ.12 వేలు మంజూరు చేస్తోంది. అలాగే వానపాముల తయారీ యూనిట్ల నిర్మాణానికి రూ.15వేల చొప్పున రాయితీ ఇస్తోంది.

40ఏళ్ల లాభాల పంట

నాలుగేళ్ల పాటు పామాయిల్ తోటలను జాగ్రత్తగా పెంచితే, తర్వాత 40 ఏళ్ల పాటు రైతుకు లాభాలు తెచ్చిపెడుతుంది. జిల్లాలో నేల సారం మేరకు ఎకరాలో 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుంది. పామాయిల్ టన్ను ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.13,058 వరకు పలుకుతోంది. ఒక దశలో ఈ రేటు రూ.20వేల వరకు వెళ్లింది. ఈ లెక్కన అన్ని ఖర్చులు పోను ఎకరాకు రూ.60వేల నుంచి రూ.70 వేల వరకు ఆదాయం వచ్చే అవకాశముంటుంది. అలాగే అంతర పంటలను సాగు చేసుకోవడం ద్వారా కూడా రైతులు లబ్ధి పొందవచ్చు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు

పామాయిల్ సాగులో డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కొనుగోలుకు చిన్న,సన్నకారు రైతులకు ప్రభుత్వం ఏకంగా 90శాతం సబ్సిడీ అందిస్తోంది. డ్రిప్ ఇరిగేషన్ సామగ్రి యూనిట్ ధర రూ.2.30లక్షలు కాగా రైతులు పదిశాతతం చెల్లిస్తే. మిగతా మొత్తాన్ని ప్రభుత్వమే సమకూరుస్తోంది. అలాగే కంచె వేసుకోవడానికి హెక్టారుకు రూ.16వేలు అందజేస్తోంది. పామాయిల్ గెలలు కోసేందుకు వీలుగా అవసరమైన యంత్రసామగ్రి కొనుగోలుకు 50శాతం సబ్సిడీతో పరికరాలను పంపిణీ చేస్తోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..



ప్రభుత్వం ప్రోత్సాహంతోనే పామ్ ఆయిల్ సాగు చేస్తున్నా. తొలుత ఈ పంట సాగు చేసే విధానం తెలియదు. ఉద్యానశాఖ అధికారుల సహకారంతో ఆయిల్ పామ్ తోటల పెంపకం చేపట్టాం. వారి సలహాలతో దిగుబడి పెంచుకునే దిశగా వెళుతున్నాం. పంట మార్పిడితో ఆదాయం పెంచుకునేందుకు అడుగులు వేస్తున్నాం. – రామిరెడ్డి, రైతు, వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

మార్కెట్ ఇబ్బందులు లేవు



పామ్ ఆయిల్ పంటకు మార్కెట్ ఇబ్బందులు లేవు. పలు కంపెనీల వారు ఇంటికే వచ్చి పంట కొనుగోలు ఒప్పందం చేసుకుంటున్నారు. ఇక ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం పక్కాగా సాయం అందిస్తోంది. అవసరాలకు తగ్గట్టు సలహాలు అందిస్తోంది. ఉచితంగా మొక్కలు అందిస్తోంది. సబ్సిడీపై పరికరాలు పంపిణీ చేస్తోంది. దీంతో మాకు పామ్ సాగు సులభతరంగా మారింది. – కోదండరామిరెడ్డి, రైతు, వేలవేడు, శ్రీకాళహస్తి మండలం

మంచి లాభాలు



ఆయిల్ పామ్ తోటల విస్తరణలో భాగంగా రైతులకు పూర్తి సహకారం అందిస్తున్నాం. దీర్ఘకాలికంగా ఆదాయం వచ్చేలా సలహాలు ఇస్తున్నాం. తోటబడి కింద ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వ పరంగా కావాల్సిన ప్రోత్సాహకాలను సకాలంలో అందజేస్తున్నాం. ఏటా పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఆయిల్ పామ్ సాగుతో రైతులు మంచి లాభాలు పొందే అవకాశం కల్పిస్తున్నాం. – దశరథరామిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖాధికారి, తిరుపతి

బీమాతో 'రూ.25లక్షల' భరోసా



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: మండలంలోని పవనివారికండ్రిగ, కోవనూరు,మర్రిగుంట, పాతపాళెం , రాగిగుంట గ్రామాలకు చెందిన ఐదు కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.25లక్షల నగదును ఎమ్మెల్యే ఆదిమూలం చేతులమీదుగా బుధవారం అందించారు. పవనివారి కండ్రిగకు చెందిన వలంటీర్ ఉదయభాస్కర్ జూన్‌లో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. కోవనూరుకు చెందిన రామయ్య రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మర్రిగుంట గ్రామానికి చెందిన కటారి సురేష్ విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. పాతపాళెం గ్రామానికి చెందిన రమేష్ అనే రైతు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. కోటమంగాపురం గ్రామానికి చెందిన దాము పిడుగుపాటుకు గురై మరణించాడు. ఆయా కుటుంబాలకు అప్పట్లోనే తక్షణ సాయం కింద రూ.10వేల చొప్పున అందజేశారు. ఈ క్రమంలో ఇప్పుడు ఒక్కొక్క కుటుంబానికి రూ.4.90లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఘటన జరిగి 40 రోజులు గడవక ముందే వైఎస్సార్ బీమా సొమ్ముతో అండగా నిలవడం ఆనందంగా ఉందని బాధిత కుటుంబాలవారు తెలిపారు. తమను ఆదుకోవడంతో ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే ఆదిమూలానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మృతి చెందిన వలంటీర్ ఉదయభాస్కర్ భార్యను వెంటనే వలంటీర్‌గా నియమించాలని ఎమ్మెల్యే ఆదేశించడం విశేషం.

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యంపై కేసు


చంద్ర (ఫైల్)

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేన కూరుకు చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. వివరాలు.. నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఒబ్బు మాలకొండయ్య కుమారుడు చంద్ర జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. సక్రమంగా చదువుకోకపోవడంతో తండ్రి మందలించాడు. ఈ క్రమంలో జూలై 30వ తేదీన చంద్ర అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి గాలించినా చంద్ర ఆచూకీ తెలియకపోవడంతో మాలకొండయ్య పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్నం.. 'నవరత్న' సమాచారం

రేణిగుంట : రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీలో నవరత్న పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను సర్పంచ్ గంగారి రమేష్ వినూత్నంగా ఆవిష్కరించారు. లబ్ధిదారుల పేర్లు, ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని సవివరంగా తెలియజేస్తూ సమాచార బోర్డులు ఏర్పాటు చేయించారు. నాలుగేళ్లుగా ఏ పథకానికి ఎంతమంది లబ్ధిదారులు, ఎవరికి ఎంత మొత్తం అందిందనే సమగ్ర వివరాలను బోర్డులో పొందుపరిచారు. ఈ మేరకు 5వేల జనాభా, 3వేల మంది ఓటర్లు ఉన్న ఈ పంచాయతీలో 1,519 కుటుంబాలకు రూ.32కోట్ల 64లక్షల 89వేల 317 రూపాయల లబ్ధి చేకూరినట్లు గణాంకాలతో పేర్కొన్నారు. ఈ క్రమంలో బుధవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమాచార బోర్డులను ఆవిష్కరించారు. అలాగే సొంత నిధులతో వలంటీర్లకు యూనిఫామ్ అందించిన సర్పంచ్ రమేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు.



సమాచార బోర్డు


లబ్ధిదారుల సమాచారంతో బోర్డులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,680
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,440

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,500
రిటైల్ వెండి గ్రాము	రూ.74.50

సీఎం సభకు స్థల పరిశీలన

నగరి : పట్టణంలో ఈ నెలలో జగనన్న విద్యాదీవెన అమలులో భాగంగా సీఎం సభ నిర్వహించనున్న నేపథ్యంలో స్థల పరిశీలన నిమిత్తం జిల్లా కలెక్టర్ నగిలి షణ్మోహన్, ఎస్పీ రిషాంత్ రెడ్డి బుధవారం నగరి పట్టణానికి విచ్చేశారు. సభ నిర్వహణ, హెలిప్యాడ్ ఏర్పాటు నిమిత్తం మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎస్పీ రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఆర్కే రోజాతో కలిసి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులకు ఏవైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు సాధించిన ఫలితాలను ఆరా తీసిన ఆయన చదివేది ఏ కోర్సు అయినా అందులో ముందంజలో ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. అవగాహనతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మా బిడ్డకు జరిగినట్లు..మరెవరికీ జరగకూడదు!

చిత్తూరు రూరల్: 'మా బిడ్డకు జరిగినట్లు.. మరెవరికీ జరగకూడదు.' ప్రభుత్వాస్పత్రిలో మరణించిన పసికందు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు నగరం ఖాదర్ మీనాస్ వీధికి చెందిన సర్దార్, రోష్ని దంపతుల 20 రోజుల పసికందును చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి వారం రోజులకు క్రితం తీసుకొచ్చారు.ఆ సమయంలో యాంటీ బయోటిక్ ఇంజెక్షన్ ఇవ్వడంతో బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై బుధవారం డీఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి, డీఐఓ రవిరాజు, డీఎస్‌ఓ శిరీష, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ విచారణ చేపట్టారు. తల్లిదండ్రుల సమక్షంలో చేపట్టిన ఈ విచారణలో ఎస్ఎన్‌సీయూ డాక్టర్లు, సిబ్బంది బిడ్డ ఇన్ఫెక్షన్ వల్లే చనిపోయిందని చెప్పారు. దీనిపై స్పందించిన బాధితులు మాట్లాడుతూ ఆ మాట అవాస్తవమని, బిడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకుంటామని వాదించారు. ఇన్ఫెక్షన్ ఉందనే విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ వేరే వారికి రాకుండా చూడాలన్నదే తమ కోరికని విచారణ నుంచి వారు తప్పుకున్నారు.


విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ ప్రభావతి, డీఐఓ రవిరాజు, ఇతర అధికారులు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని తారకరామా మైదానంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అండర్- 16 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. బుధవారం అనంతపురం-చిత్తూరు, కడప-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. గ్రౌండ్-1లో బ్యాటింగ్ దిగిన అనంతపురం జట్టు సెకెండ్ ఇన్నింగ్స్‌లో 127 ఓవర్లకు 346 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. భాను ప్రసాద్ 94, భువనేశ్వర్ 54, హర్షవర్ధన్ 60 పరుగులు చేశారు. చిత్తూరు జట్టు బౌలింగ్ విభాగంలో సోహాన్ రెండు వికెట్లు తీశారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు లీడ్‌లో ఉంది. గ్రౌండ్-2లో కడప-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెకెండ్ ఇన్నింగ్స్ ముగిసే సమయానికి కడప జట్టు 90.2 ఓవర్లకు 399 పరుగులు చేసింది. చేతన్‌రెడ్డి 136, సాయి రోహిత్ 52, గురువెంకటేష్ 53 పరుగులు చేశారు. బౌలింగ్ విభాగంలో కుళ్లాయప్ప 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు సెకండ్ ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లకు 15 పరుగులు తీసి 1 వికెట్ కోల్పోయింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లీడ్‌లో ఉంది. మ్యాచ్‌లకు స్కోరర్‌గా సీడీ శ్రీనివాసులరెడ్డి, అంపైర్‌గా హేమచంద్ర, ఆకులన్న, రవి, ఫణీంద్ర వ్యవహరించారు.


136 పరుగులు చేసిన కడప ఆటగాడు చేతన్‌రెడ్డి



మద్యం వ్యాను బోల్తా



పూతలపట్టు: మద్యం వ్యాను బోల్తా పడిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎం.బండపల్లి సమీపంలోని మద్యం గోడౌన్ నుంచి పాకాలకు వెళుతున్న మద్యం వ్యాను పూతలపట్టు చెరువు క్రాస్ వద్ద వ్యాను ముందు టైరు పేలడంతో డివైడరుకు ఢీకొని బోల్తా పడింది. వ్యానులోని మద్యం బాటిళ్లు ధ్వంసమయ్యాయి. దీని విలువ సుమారుగా రూ.2 లక్షలు ఉంటుందని స్థానికులు తెలిపారు. మద్యం కోసం ఎగబడిన ప్రజలు కొంత మొత్తంలో మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వ్యాను నడుపుతున్న డ్రైవర్ స్వల్పగాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

జాతీయ జెండాకు అవమానంపై కేసు

దక్కిలి : మండలంలోని చాపలపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం ఎగురవేసిన జాతీయ జెండాకు అవమానం జరిగింది. పతాకావిష్కరణ అనంతరం అందరూ వెళ్లిపోయిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు జెండాను దగ్ధం చేశారు. జెండాను భద్రపరిచేందుకు సాయంత్రం పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు అశోక్ ఈ విషయాన్ని గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఆకతాయిలు చేసిన పనిగా ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనట్లు వెల్లడించారు.

టీటీడీ చైర్మన్ భూమనకు అభినందనలు


టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు తెలుపుతున్న చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్


శాసనమండలి ఉపాధ్యక్షులు జకియాఖానం

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని బుధవారం పద్మావతిపురంలోని ఆయన నివాసంలో శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీడీ చైర్మన్‌గా నియమితులైందుకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

థ్యాంక్యూ సీఎం సార్...

చిత్తూరు కలెక్టరేట్ : 20 ఏళ్లుగా ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యను పరిష్కరించినందుకు థ్యాంక్యూ సీఎం సార్ అని ప్రభుత్వ కాంట్రాక్ట్ లెక్చరర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యను గతంలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నెరవేర్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల నిబంధన తొలగించి వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేసేందుకు సీఎం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జూనియర్ కళాశాలల్లో 510, డిగ్రీ కళాశాలల్లో 75, పాలిటెక్నిక్ 50 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లకు లబ్ధి చేకూరనుందని ఆయన వెల్లడించారు.

ఆర్ఏఆర్ఎస్ ఉద్యోగుల అభినందనలు

తిరుపతి సిటీ: ఆర్.శారద జయలక్ష్మీదేవి ఆర్ఏఆర్ఎస్ ఉద్యోగుల అభినందనలు తెలిపారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ఆర్.శారద జయలక్ష్మీదేవి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి బుధవారం సాయంత్రం రిలీవ్ ఆర్డర్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆర్ఏఆర్ఎస్, వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి, సైంటిస్టులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


అభినందనలు తెలుపుతున్న ఆర్ఏఆర్ఎస్, వ్యవసాయ కళాశాల అధికారులు, ఉద్యోగులు

హైనా దాడిలో ఆవు మృతి

రామకుప్పం: మండలంలోని పంద్యాల మడుగులో రైతు సోమారెడ్డికి చెందిన ఆవుపై మంగళవారం రాత్రి హైనా దాడి చేసి చంపేసినట్లు కుప్పం అటవీ క్షేత్రాధికారి వైవీ రెడ్డి తెలిపారు. ఇంటి ఆవరణలో కట్టి ఉంచిన ఆవు మృతి చెందడంతో ఆవును చిరుతపులి చంపినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. కాలిముద్రికల ఆధారంగా ఆవుపై దాడి చేసింది హైనా అని, చిరుత కాదని వైవీ రెడ్డి తెలిపారు. అటవీ గ్రామాల ప్రజలు, పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

వినాయకుని దర్శించుకున్న అఘోరాలు

కాణిపాకం(యాదమరి): గుజరాత్‌కు చెందిన నాగస్వామి అఘోరాల బృందం సభ్యులు 15 మంది బుధవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం వారు విచ్చేయగా ఆలయాధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

సారా.. కర్ణాటక మద్యం పట్టివేత

చిత్తూరు అర్బన్: ఎస్ఈబీ అధికారులు వేర్వేరు చోట్ల దాడులు చేసి సారా, కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ అధికారుల కథనం మేరకు.. ఎస్ఈబీ అధికారులకు రహస్య సమాచారం అందడంతో గుడిపాల మండలం చిత్తపార గ్రామంలో బుధవారం సారా తయారీ, విక్రయాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, విక్రేత రాందాస్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే చిత్తూరు నగరం లెనిన్ నగర్‌లో 21 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. మద్యం అమ్ముతున్న ఆర్ముగంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్ఐ బాబు, రాంప్రసాద్, సిబ్బంది బాబు, వెంకటేశ్వర్లు, జయశంకర్, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా ఏడు గంగల జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం


విశేషాలంకరణలో గంగమ్మ

నారాయణవనం: మండలకేంద్రంలో ఏడు గంగమ్మల జాతరను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతరకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు బలిజ సంఘం నాయకులు శరత్‌కుమార్, చలపతి సాదరంగా ఆహ్వానం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. నారాయణవనం, సముదాయం, కీళగరం, వీకేపాళ్యం, నాగిలేరు, బొప్పరాజుపాళ్యంలో ఏడు గంగమ్మలు విశేష అలంకరణలతో వేర్వేరుగా మంగళవారం రాత్రి ఊరేగింపునకు బయలుదేరారు. బుధవారం వేకువజామున అమ్మవారు ఆయా ప్రాంతాల్లో కొలువుదీరారు. భక్తులు పెద్దసంఖ్యలో గంగమ్మను సేవించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పిండి దీపాలను వెలిగించి, కుంభం సమర్పించారు. గంగమ్మను ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, పార్టీ నాయకులు ఏకాంబరం, గురుస్వామి, తులసిముని, మోహన్, సారకాయలు దర్శించుకున్నారు. సాయంత్రం మాజీ ఎమ్మెల్యే హేమలత, హెలెన్ అమ్మవారిని సేవించుకున్నారు. అనంతరం నిమజ్జనం సందర్భంగా అమ్మవారి పసుపును అందరికీ పంచిపెట్టారు. ఎస్ఐ పరమేష్ నాయక్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

స్వర్ణముఖిలో 'పునీత్‌సాగర్ అభియాన్'



స్వర్ణముఖి నదీతీరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్లు గూడలి గ్రామం వద్ద పునీత్‌సాగర్ అభియాన్ కింద స్వర్ణముఖి నదీతీరాన్ని శుభ్రం చేశారు. లెఫ్టినెంట్ కమాండెంట్ వినయ్ రామచంద్రన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, నరేంద్రబాబు, నీలేష్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

రేణిగుంట : రైల్వేకోడూరు మార్గంలో మామండూరు- కుక్కలదొడ్డి మధ్య రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం బుధవారం లభ్యమైనట్లు రేణిగుంట జీఆర్‌పీ పోలీసులు తెలిపారు. మృతుడికి సుమారు 50- 55 ఏళ్లు ఉంటాయని, రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

